




బాగా డబ్బున్న ఆసామీ ఇల్లు. మధ్య హాలు. తెర తొలగే సరికి-ఎడమ వేపున్న ద్వారం ఇంట్లోకి. కుడివేపున్న ద్వారం బయటికి. ప్రేక్షకులకు ఎదురుగ్గా, స్టేజీకి వెనగ్గా వున్న గోడమీద రకరకాల మోడరన్ డెకొరేషన్స్. హాల్లో మూలగా ఓ కిటికీ - సహం తెరిచుంది. కిటికీకి ఇవతల - రంగస్థలానికి కుడివైపున వో పెద్ద కుర్చీలో వైకుంఠం కూర్చుని వున్నాడు. ప్రేక్షకులకు అతని వీపు మాత్రమే కనిపిస్తుంది. కుర్చీపై అంచుమీద వెనగ్గా వాలివున్న అతని తల. ఆ తల ముగ్గుబుట్టలా పండిపోయివుంది. హాల్లో ఖరీదైన ఫర్నిచర్. ఇంట్లోకి వెళ్ళే ద్వారానికి అటు పక్కగా వో టేబిలు, దానిచుట్టూ కుర్చీలు. కొంచెం దూరంలో కొత్తగా కొన్నట్టున్న కలర్ టి.వి.

పాంచజన్యం, గజలక్ష్మి టేబిలుకు చెరోవైపూ కుర్చీల్లో కూర్చుని వున్నారు. పాంచజన్యానికి వయస్సు నలభైపైన. కోలమొహం, స్టైలిష్‌గా వున్నాడు. మనిషి మొటమొటలాడి పోతున్నాడు. గజలక్ష్మి వయస్సు అతనికన్నా వో అయిదారేళ్ళు తక్కువ. పిటపిటలాడిపోతున్నది. చూడగానే, కళ్ళు తిప్పుకో లేనంత ఆకర్షణ. ఎబ్‌నార్మల్ మేకప్.

పాత్రలు

| | | |
|---|---|---|
| వైకుంఠం | పాంచజన్యం | చక్రధరం |
| సుదర్శనం | మాతల మహేశ్వరం | |
| నల్లకోటు నాగేశ్వరం | గజలక్ష్మి | |

పాంచజన్యం: ఆఖరిసారిగా అడిగేస్తున్నాను, ఇస్తావా, ఇవ్వవా, తేల్చి చెప్పు?

గజలక్ష్మి: (కొంటెగా) ఇవ్వనంటానా,
అడగక, అడగక
అడిగినవాడు
ఇవ్వనంటానా?
ముద్దు ఇవ్వనంటానా?
మురిపెం తీర్చనంటానా?
ముచ్చట కూడదంటానా?
అడగక అడగక అడిగినవాడు...(కూనిరాగం తీస్తుంటుంది)

పాంచజన్యం: అయితే ఇచ్చేయ్, ఆలస్యం ఎందుకూ?

గజలక్ష్మి: (లేచి, దగ్గరకు వచ్చి, చెంపనందిస్తూ)ఊ...! తీసుకో!!

పాంచజన్యం: (తెల్లబోయి) సిగ్గులేదు మొహానికి...వేళాపాళా లేదు, ఎప్పుడూ అదే ధ్యాస!! (కటువుగా)

గజలక్ష్మి: అవును మరి, నాకీ ధ్యాస, నీకా ధ్యాస!! ఎవరి ధ్యాస వారిది.

పాంచజన్యం: నా అలవాట్లను గురించి నువ్వేం విమర్శించనక్కర్లా - దే ఆర్ మేన్లీ హాబిట్స్!

గజలక్ష్మి: ఏసీ...అలవాట్లల్లో మేన్లీ హాబిట్స్, ఉమన్లీ హాబిట్స్ అంటూ వేరేవేరే ఉన్నాయేమిటీ - నాకు తెలీదే!

పాంచజన్యం: రేస్ కోర్సెస్‌కు వెళ్ళడం, ఏ గుర్రం గెలుస్తుందో ముందుగా లెక్కగట్టి దానిమీద బెట్ కట్టడం, దట్ ఈజ్ ఏ మేన్లీ హాబిట్!

గజలక్ష్మి: ఆ తర్వాత, సర్వం తిరుక్షవరమై, చిప్ప చేతికొస్తే, దేవుడా ఇంత చేశావా అని ఏడవడం ఉమన్లీ హాబిట్సా?

పాంచజన్యం: క్లబ్బులో ఫుల్ టేబిల్లో కూర్చొని, కలర్డ్ చిప్స్ మార్చు కుంటూ, టబ్ కార్డుకోసం వెయిట్ వెయ్యడం మాన్లీ హాబిట్...

గజలక్ష్మి: అవతలవాడికి డీల్‌పడి, మనకు ఆల్‌కౌంట్ అయితే, వెంగు మొహాన కప్పుకుని, గుడ్లనీళ్ళు గుడ్ల కుక్కుకుంటూ కొంప చేరుకోడం ఉమన్లీ హాబిట్, కదూ?


పాంచజన్యం: రెండు పెగ్గులు కాక్‌టెయిల్ వేసుకుని, త్రీఫైవ్స్ సిగరెట్టంటించు కుని సిక్స్‌త్ హెవెన్‌లో షికార్లు కొట్టగలగడం మాన్లీ హాబిట్...

గజలక్ష్మి: అడుగులు తడబడి, మాటలు కొరవడి, దబ్‌మారో దబ్ అనుకుంటూ రోడ్లమీద దొర్లడం ఉమన్లీ హేబిట్...అవును కదూ?
పాంచజన్యం: వన్నిన్‌సల్ట్ చేస్తున్నావ్!!
గజలక్ష్మి: అనుకుని భ్రమపడుతున్నావ్...విన్ను రిక్వెస్ట్ చేస్తున్నాను.
పాంచజన్యం: ఏ...వ...ని...!!
గజలక్ష్మి: ఆ గుర్రప్పందాలు మానుకోమని! క్లబ్బులో పేకాటలవాటు వదులుకోమని! తాగుడుకు బానిసవు కావద్దని!
పాంచజన్యం: (పెద్దగా నవ్వుతూ, చప్పట్లు కొడుతూ) థ్యాంక్యూ మిసెస్ గజలక్ష్మి వైకుంఠం! థ్యాంక్యూ వెరీమచ్!! థ్యాంక్యూ ఎలాట్ ఫర్ యువర్ సజెషన్స్! (వైకుంఠానికి వెనగ్గా నిలబడి) అయ్యా వైకుంఠంగారూ, లక్షాధికారి, బిజినెస్ మాగ్నెట్, సాంఘిక సేవక సామ్రాట్ వైకుంఠంగారూ, విన్నారా, త ముద్దుల భార్య హిత వచనాలు?! ఎవరికి...తన...ప్రియుడికి...మీ ముందే...!
గజలక్ష్మి: సంతోషించాం కానీ, ఇట్రా!! నువ్వు అరిచి గీపెట్టినా ఆయనకే వినిపించదు, కనిపించదు.
పాంచజన్యం: అవును మరి, కనిపిస్తే - వినిపిస్తే, మన రాసలీల లెట్లా సాగుతయ్
గజలక్ష్మి: (కోపంగా) వెక్కిరిస్తున్నావా?
పాంచజన్యం: అ...మ్మ...మ్మా!! వెక్కిరించడమ్? విన్ను? యూ ఆర్ గోల్డెన్ గూస్!! విన్ను నేను వెక్కిరిస్తే, నాకు రేసుల్లేవు, పేకాట కోర్సుల్లేవ



కాక్‌టెయిల్ పార్టీల్లేవు. అంచేత మై డియర్ ఆయన్ని నువ్వెందుకు కట్టు కున్నావో, ఆ ముసిలాణ్ణి అడ్డం పెట్టుకుని నన్నెందుకు రమ్మంటున్నావో, నాకనవసరం. రియల్లీ!! నా కనవసరం!! నా క్కావలసిందల్లా నువ్వెప్పుడూ నవ్వుతూ వుండడం, నా అలవాట్లకు నువ్వు అడ్డం రాకుండా, నేనడిగింది నాకిస్తూ, నా దగ్గర్నుంచి నీక్కావలసింది నువ్వు తీసుకుంటూ ఉండడం...
గజలక్ష్మి: (బుంగమూతి పెట్టి) ఇప్పుడే కదమ్మా, నువ్వు నన్నెగతాళి చేసింది-


నాకు సిగ్గులేదనీ, నాకు వేళాపాళా లేదనీ, అదే ధ్యాసనీ...
పాంచజన్యం: పొరపాటయిపోయింది...లెంపలు వాయించుకోనా?
గజలక్ష్మి: నువ్వు కాదు...నేను వాయిస్తాను.
పాంచజన్యం: అమ్మో, నీ చేతులు కందిపోతాయి.
గజలక్ష్మి: అంతేనా, ఆడవాళ్ళ చేతులకు చురుకెక్కువనా?
పాంచజన్యం: పోనీ, రెండూ అనుకో!
గజలక్ష్మి: కృష్ణుడు, సత్యభామ కాలిబలం రుచి చూశాడు.
పాంచజన్యం: ఆ కృష్ణుడికి సత్యభామ కాలిబలం రుచి తెలిస్తే, ఈ పాంచజన్యానికి గజలక్ష్మి చేతివాటం రుచి తెలుసు...(లాలనగా) గజం...ప్లీజ్...మై రిక్వెస్ట్...
గజలక్ష్మి: ఓ.కె! లాస్ట్ అండ్ ఫైనల్ టైం ఫర్ యువర్ రేసెస్!! పర్సులో వుంది ఎంత కావాలో తీసుకో...
పాంచజన్యం: (అటూ యిటూ వెతుకుతూ) పర్సెక్కడుందీ? కనబడదేం?
గజలక్ష్మి: వెతికే చోట వెతికితే కనబడుతుంది! ఆడవాళ్ళు పర్సెక్కడ దాచుకుంటారో కూడా తెలియదుకానీ వో మగమహారాజునని పోజు.
పాంచజన్యం: చూడూ, ఇది ఎంత రాత్రైనా, ఆ కుర్చీలో కూచున్న మనిషికి ఎంతగా కనిపించకపోయినా, వినిపించక పోయినా, అతగాడు నీకు తాళికట్టిన మొగుడు-ఆయనక్కడుండగా నేను నీ జాకెట్టులో వెతకడం...ఐ ఫీల్ గిల్టీ!!
గజలక్ష్మి: బట్...ఐ డోన్ట్!! లేని వాళ్ళింట్లో పుట్టాను కదా అని, పశువును




కొనుక్కొన్నట్టుగా నన్ను డబ్బుపోసి కొనుక్కొని, మెడలో ఓ పలుపుతాడు కట్టడం, అది తప్పు కాదా? తన దగ్గర డబ్బు అప్పుతీసుకున్నాడు కదాఅని మా నాన్నను పీడించి, ఏడిపించి, రాచి రంపాన పెట్టి వన్నిట్లా తనకు పెళ్ళిచేయడానికి ఒప్పించడం తప్పుకాదా? శుభమా అంటూ పాలగ్లాసుతో నేనా గదిలోకి అడుగు పెడితే, కలల్లో తేలిపోవాల్సిన సమయంలో ''కాళ్ళు పీకుతున్నాయ్ గజలక్ష్మీ, కొంచెం పట్టవూ?'' అంటూ కాళ్ళు పట్టించుకుంటూ, పట్టించుకుంటూ గుర్రుపెట్టి నిద్రపోవడం తప్పుకాదా? తవ్వుకుంటే అన్నీ తప్పులే!! ఆ తప్పుల్లో నిన్ను నా బోయ్ ఫ్రెండ్‌గా వుంచుకోడం ఓ తప్పుకాదులే!! నువ్వేం గిల్టీగా ఫీల్ కానక్కర్లేదు. డబ్బు కావాలో, అక్కర్లేదో తేల్చుకో!
పాంచజన్యం: కావాలి...కావాలి...రేపు హైదరాబాదు రేసుల్లో డక్కన్ క్వీన్ పరుగెడుతోంది. అది నా ఫేవరెట్ హార్స్!!
గజలక్ష్మి: అవున్లే, గుర్రాలే నీకు ఫేవరేట్స్!! మనుష్యులు కాదు.
పాంచజన్యం: అట్లా అనకు మై డియర్!! నువ్వంటే నాకు ప్రాణం అని నీకు తెలీదు? పెళ్ళి చేసుకోవద్దు పాంచజన్యం అన్నావ్. మానేశాను. పాంచజన్యం ఈజ్ అవర్ పర్సనల్ సెక్రటరీ అని వైకుంఠం గారికి ఇంట్రడ్యూస్ చేశావ్. అది అలుసుగా తీసుకుని ఆ ముసలాయన అడ్డమైన పన్లూ చెయ్యమంటే నీకోసం, నీ కోసమే గజలక్ష్మి-అవన్నీ చేశాను!! ఊరపిచ్చుక లేహ్యం తినమన్నావ్, తిన్నాను. చలికాలంలో ఊటీకి పోదాం పద అన్నావ్. సరే అన్నాను. నీకోసం నేనేం చెయ్యలేదు? యూ ఆర్ ఆల్‌సో మై ఫేవరెట్ హార్స్ మైడియర్ గజలక్ష్మీ!
గజలక్ష్మి: అట్లా అనకమ్మా...(గోముగా) నాకు సిగ్గేస్తుంది.
పాంచజన్యం: సిగ్గూ ఎగ్గూ ఎప్పుడో బుగ్గిలో కలిపేశాం. మనం ప్రేమ పక్షులం. ఇహలోకం మర్యాదలకూ, నియమాలకూ మనం అతీతులం.
(పాంచజన్యం, గజలక్ష్మి దగ్గరకు వచ్చి ఆమె జాకెట్‌లో చెయ్యిపెట్టి పర్సు తీసుకోబోతాడు. ఆమె తప్పించుకుంటూ అటూయిటూ పరుగెత్తుతుంటుంది. అప్పుడే కుడివేపు నుండి చక్రధరం వస్తాడు. వయసులో వున్న కుర్రాడు బీదగా వున్నాడు. అతనిమీద పడుతుంది గజలక్ష్మి. అతను గభాలున ఆమెను పడకుండా పట్టుకుని, మళ్ళీ వదిలేస్తూ-)
చక్రధరం: సారీ మేడమ్!
గజలక్ష్మి: (కోపంగా) యూ ఫూల్!! ఎవడ్రా నువ్వు?
చక్రధరం: నేనూ...నేనూ...ఆర్ఫనేజ్ నుండి వస్తున్నానండీ! నా పేరు చక్రధరమండీ! (పాంచజన్యాన్ని చూసి) నమస్కారమండీ! అమ్మగార్ని చూళ్ళేదు. సారీ! సో సారీ అండీ!!
పాంచజన్యం: దట్సాల్ రైట్! ఎందుకొచ్చావిక్కడకు?
చక్రధరం: ఎందుకేవిటండీ...ఉండటానికండీ!
పాంచజన్యం: (ఆశ్చర్యంగా) ఉండటానికా? (గజలక్ష్మి వేపు అనుమానంగా చూస్తూ) ఇ...క్క...డా? నువ్వు పిలిపించావా గజలక్ష్మీ ఇతన్ని? ఇంత అందమైన కుర్రాణ్ని!!
గజలక్ష్మి: లేదే!! నేనేం పిలిపించలేదే?
చక్రధరం: మీరు కాదు మేడమ్! అయ్యగారే తమాషాగా మాట్లాడుతున్నారు. వారే పిలిపించారు.
పాంచజన్యం: నేనా? నెవర్!! డోన్ట్ బ్లఫ్!! (చక్రధరం కాలరు పుచ్చుకుని) నిజం చెప్పు. నువ్వెవరు? ఎవరు పంపించారు నిన్ను? ఎందుకొచ్చావిక్కడకు?
చక్రధరం: నిజమేనండీ! నా పేరు చక్రధరమేనండీ! దుర్గాబాయ్ హోమ్ ఫర్ ఆర్ఫన్డ్ చిల్డ్రన్ నుంచే వస్తున్నానండీ! తవరే వో వారం క్రితం వొచ్చి నాకు కళ్ళు సరిగా కనబడడం లేదు, చెవులు వినబడడం లేదు. సహాయంగా వో మంచి కుర్రాణ్ణి పంపించండీ! అని అడిగారట కదండీ! అందుకనీ మా మేనేజరుగారు నన్ను పిల్చి, ''ఒరేయ్ చక్రధరం, నువ్వంటే నాకు నమ్మకంరా, నువ్వెంతోమంచి కుర్రాడివిరా, ఆ పెద్దాయన మనకెంతో ఉపకారం చేసే మనిషిరా, తప్పకుండా వెళ్ళరా, వెళ్ళి ఆయన్ని జాగర్తగా కనిపెట్టి చూడరా!'' అని చెప్పి పంపించారండీ! తీరా ఇక్కడికి వస్తే, మీరేమో...(పాంచజన్యం వేపు పరకాయించి చూస్తూ) అన్నట్టు మీకు చెవులూ, కళ్ళు బాగానే వున్నట్టున్నాయ్ కదండీ! మరెందుకు రమ్మన్నారండీ? మీరు...మీరు...మీరు కాదా అండీ రమ్మన్నదీ?
గజలక్ష్మి: (అనుమానంగా) పాంచజన్యం గారూ! ఓ మాట!! ఆ కుర్రాణ్ణి వొదిలేసి ఇట్రండి! (ఇద్దరూ స్టేజికి ఆ మూలకు వెళ్ళారు. గుసగుసగా) మా ఆయనేమన్నా పిలిపించుకున్నాడేమో ఈ కుర్రాన్ని, తనకుసాయంగావుంటాడని!!
పాంచజన్యం: ఈ కుర్రాడే ఇక్కడుంటే...మనపనికి ఇంతే సంగతులు.
గజలక్ష్మి: ఆ కుర్రాడిక్కడెందుకబ్బా?!...కొంపతీసి ముసలాయనకు మనమీద అనుమానం ఏదన్నా కలుగలేదు కదా?
పాంచజన్యం: కలిగితే మాత్రం మననేం చేస్తాడూ ఆ గుడ్డి, చెవుడు మనిషి?
గజలక్ష్మి: నిన్నేంచెయ్యలేడు. నన్నుమాత్రం కళ్యాణ కట్టకు పంపిస్తాడు.

పాంచజన్యం: తెలిసేట్టు చబుదూ?
గజలక్ష్మి: ఈ ఆస్తంతా ఆయన స్వార్జితం. రేపో మాపో హరీమనే సమయంలో ఆయనకు అనుమానం రావడం మంచిది కాదు.
పాంచజన్యం: నీకాభయమేం అక్కర్లేదు. నీ సహం వాటాకు నీకు ఢోకా లేదు.
గజలక్ష్మి: పూర్తి వాటా కోసం నేను తంటాలు పడుతుంటే, సహం వాటా అంటూ అపశకునం మాటలు మాట్లాడతావేమిటి?
పాంచజన్యం: సరే, సరే. మాట్లాడను గానీ, ముందా కుర్రవాణ్ణి, ఆ యంగ్ అండ్ హాండ్సమ్ బోయ్‌ను ఏం చేస్తావో చెప్పు?
గజలక్ష్మి: చెయ్యటానికేముందీ? ఎక్కడ్నించొచ్చాడో అక్కడికి వెళ్ళమనడమే!

పాంచజన్యం: ఓ.కే. (చక్రధరం వేపు చూస్తూ) అబ్బాయ్! నీ పేరేమిటన్నావ్-చక్రధరం కదూ? అమ్మగారు నీ సర్వీసెస్ అక్కర్లేదంటున్నారయ్యా-అంచేత నువ్వు తిరిగి ఆ దుర్గాబాయ్ హోమ్‌కే వెళ్ళిపో!!
చక్రధరం: అమ్మగారి క్కాదండీ నా సర్వీసెస్! అయ్యగారికండీ!
పాంచజన్యం: (విసుగ్గా) ఆ అయ్యగారి క్కూడా నీ సర్వీసెస్ అక్కర్లేదయ్యా!!
చక్రధరం: అసలు ఆ కళ్ళూ చెవులూ కనిపించని వినిపించని అయ్యగారేరండీ! ఆయన కనిపించరేమండీ! (పడక్కుర్చీ వేపు చూస్తూ) ఆ కుర్చీలో వున్నారా అండీ! ఆయన పేరు కూడా ఏదో చెప్పారండీ! ఆ! వైకుంఠం గారనండీ! అయ్యా



వైకుంఠం గారూ!! వైకుంఠం గారూ!!
పాంచజన్యం: నీ బండ పడ!! సరాసరి ఆ వైకుంఠానికే వినబడేటంత పెద్దగా రంకెలు పెడుతున్నావ్!! కట్టేయ్, కట్టేయ్ నీ గుర్రాన్ని!! నీ గుర్రం అడంగుచేరదు. ఆ వైకుంఠం మహానుభావుడు ఇప్పుడు నీ మాటా నామాటా వినే స్థితిలో లేదు. అంచేత-
చక్రధరం: అంచేతనే కదండీ నేను వచ్చిందీ! ఆయనకు సేవ చేసుకుంటూ




ఇక్కడే వుండిపోతాను!!
గజలక్ష్మి: వద్దు. నువ్వెళ్ళిపో!
చక్రధరం: క్షమించడమ్మగారూ! నన్ను వెళ్ళిపొమ్మనకండి!! నేను వుండకుండా వెళ్ళిపోతే, వుండలేక వచ్చేశానని మా మేనేజరుగారు నన్ను అపార్థం చేసుకుంటారు.
పాంచజన్యం: అయినాసరే, నువ్విక్కడ వుండటానికి వీల్లేదు.
చక్రధరం: (మొండిగా) ఆ వైకుంఠం బాబుగారే నన్ను రమ్మన్నారట! ఆ బాబుగారే చెప్పాలి. మళ్ళీ నన్ను వెళ్ళిపొమ్మని!! అప్పుడు గాని వెళ్ళను!
గజలక్ష్మి: (కటువుగా) అమ్మగార్ని నేను చెబుతున్నాను. నువ్వెళ్ళిపో!!
(బయటనుంచి సుదర్శనం ప్రవేశం. గజలక్ష్మి ఈడు మనిషి. రౌడీ వాలకం. రేగిపోయిన జుట్టు. ఎర్రని చింత నిప్పుల కళ్ళు. ఎడమ చెయ్యి చొక్కా సగం మడిచి

మూలశంకకు
త్వరగా నమ్మకమైన
హెడన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!




మీ మడమల మీద చూడ
అసహ్యమై, బాధాకరమైన
పగుళ్లున్నవా?



ఉపశమనం కలిగించే లిచెన్‌సా చర్మ లేపనం
మీకు నిరపాయకరమైన శీఘ్ర నివారణ కలిగిస్తుంది.

అది ముఖ్యంగా మీ మడమల మీద ఏర్పడే పగుళ్ల
నివారణకు కూడా బాగా పనిచేస్తుంది. కోతలు, పుండ్లు,
ఇతర చిన్న గాయాలు ఇలాంటివి కూడా యీ లేపనంతో
నివారణ చేసుకోవచ్చు.




లిచెన్‌సా
చర్మలేపనం

90 TG


వుంది. కుడివైపు ప్యాంటు సగం మడిచి వుంది. మెడలో మఫ్లరును లూజ్ టైగా కట్టుకున్నాడు. మడిచిన చేతికి పంజాబీ కడియం)

సుదర్శనం: (వస్తూ) అయ్యగారబ్బాయిని నేను చెబుతున్నాను. నువ్వెళ్ళిపోకు. ఇక్కడే వుండు.

పాంచజన్యం: నువ్వెవరు?

సుదర్శనం: నువ్వెవరు?

గజలక్ష్మి: సు...ద...ర్శ...నం...!!

సుదర్శనం: అవును. సుదర్శనాన్నే!! నీ మొగుడి కొడుకును!!

చక్రధరం: (గభాలున అతిని రెండు చేతులూ పట్టుకుని) చినబాబుగారా? నమస్కారం అండీ! చూడండి సార్!! (పాంచజన్యం వేపు చూపిస్తూ) ఈయనెవరో కానీ, నేను వైకుంఠంగారి కోసం వస్తే, నన్నిక్కడ వుండటానికి వీల్లేదంటున్నారు, నన్ను వెళ్ళిపొమ్మంటున్నారు. దొరక్క, దొరక్క నాకీపని దొరికింది. పనిలో ప్రవేశించకముందే పో అనడం అన్యాయం కాదుటండీ?

సుదర్శనం: ముమ్మాటికీ అన్యాయం!

చక్రధరం: అయితే మీరు పొమ్మనరు కదా?

సుదర్శనం: అనను!

చక్రధరం: ఎంత మంచివారండీ మీరు! వైకుంఠం గారితో చెబుతాను మీ గురించి. మీరు సమయానికి రాబట్టే, నేనిక్కడ వుండిపోగలిగానని చెబుతాను.

పాంచజన్యం: నథింగ్ డూయింగ్! నువ్విక్కడుండటానికి వీల్లేదు.

సుదర్శనం: నువ్వెవరు? ఇది చెప్పడానికీ, ఇక్కడుండటానికీ! ఏం గజలక్ష్మీ!, ఓహో, నిన్ను పిన్నీ అని పిలవాలి కాబోలు. నాకన్నా చిన్న దానివి, నువ్వు నాకు పిన్నివేమిటి?

గజలక్ష్మి: చిన్నైనా, పెద్దైనా, నీ పిన్నినే! అయినా జైలు పక్షివి, నీకేం తెలుస్తాయ్‌లే వావి వరుసలు?

సుదర్శనం: (కోపంగా) అవును. జైలు పక్షినే! కానీ కాలేజీలో చదువుకొంటూ హాయిగా వుండాల్సిన వయసులో, ఈ సుదర్శనం జైలు పక్షిగా ఎందుకు మారాడో నీకేం తెలుసు? డన్లప్ పరుపుల కోసం, కార్లో తిరగడం కోసం, అమ్మవారిలా మెళ్ళో ఇన్ని నగలు దిగేసుకోవడం కోసం, మూడు పూటలూ పంచభక్ష్య పరమాన్నాలు మెక్కడం కోసం, వయసును మరిచి, మనసును చంపుకుని, గంగిరెద్దులా మెళ్ళో తాళి కట్టించుకున్న దానివి నీకేం తెలుసు ఈ దేశంలో యువకులు ఏ ఆశయాల కోసం, ఏ కన్నీళ్ళకోసం, ఏ ఆదర్శాలకు చలించి జైళ్ళకు వెళ్తున్నారో? సరే, నీతో నాకెందుకు గానీ, ఆకలిగా వుంది అన్నం పెట్టు.

గజలక్ష్మి: లేదు!

సుదర్శనం: అదేమిటి? ఇంట్లో అన్నం వండడం లేదా? లేకపోతే మీరు తినడం లేదా?

గజలక్ష్మి: రెండూ లేదు. ఇంట్లో వంటా లేదు, ఇక్కడ మేం తినడమూ లేదు.

సుదర్శనం: మరి ఆ ముసలాయనకు?

గజలక్ష్మి: గోధుమ గడ్డితో కడుపు నింపుకునే ముసలాయనకు మరో తిండెందుకు? మేమిద్దరం హోటలుకు వెళ్ళొస్తున్నాం!


సుదర్శనం: మీ ఇద్దరా? (ఏదో అర్థమైనట్టు, సడన్గా) యూ బిచ్...

పాంచజన్యం: ఏం కూశావ్? (సుదర్శనాన్ని కొట్టబోతాడు)

సుదర్శనం: (తటాలున ఓ చిన్న కత్తిని తీసి ఝుళిపిస్తూ) ఖబడ్దార్! జైలంటే నాకు భయం లేదు. ఒకసారి వెళ్ళొచ్చిన వాడ్ని! మరి వందసార్లు వెళ్ళి రాగలను. (పాంచజన్యంతో) చెప్పు. ఎవరు నువ్వు? ఈ ఇంట్లో నువ్వెందుకున్నావ్? ఇది మా నాన్న ఇల్లు. గజలక్ష్మి ఇల్లు కాదు. ముసలాయన కోసం ఓ బోయ్ వస్తే నీకేమిటి అభ్యంతరం? నువ్వూ గజలక్ష్మి కలిసి బయట భోజనం చెయ్యవలసిన అవసరం, ఆ చనువు ఎందుకు, ఎట్లా ఏర్పడింది? టెల్ మీ, క్విక్!! (కత్తిని అతని గొంతు దగ్గరకు తెస్తాడు)

పాంచజన్యం: (భయంతో, మెలికలు తిరిగిపోతూ) వద్దొద్దు. ఆ కత్తిని ఇంకా దగ్గరకు నొక్కకు. చెబుతాను. నేనెవరో చెబుతాను. నేను...నేనూ...మీ

నాన్నగారి పర్సనల్ సెక్రటరీవి!!
సుదర్శనం: (కత్తి తీయకుండానే) ఆ ముసలాయనకేనా...గజలక్ష్మికూ కాదా?
గజలక్ష్మి: (వెల్లింపుగా) సుదర్శనం లోపల నిన్నటి స్వీట్లున్నాయ్, తీసుకురానా?
సుదర్శనం: స్వీట్లు వద్దు, నీ విషపు చూపులూ వద్దు. ఆకలిగా వుంది, అన్నం పెట్టమంటేనే లేదన్న మహాతల్లివి! నీ నయగారాలూ, వయ్యారాలూ నాకెందుకు? అర్జంటుగా వో అయిదవేలు కావాలి, పారేయ్, వెళ్ళిపోతాను.
గజలక్ష్మి: అ...యి...దు...వే...లా?
చక్రధరం: వెళ్ళిపోతారా చినబాబూ, నన్నిక్కడ వొదిలిపెట్టేసి...నా సంగతి తేల్చకుండానే...వైకుంఠం గారికి నన్ను పరిచయం చేయకుండానే...
సుదర్శనం: నీకేం భయం లేదు. నువ్విక్కడే వుంటావు. ఏమండీ మా నాన్నగారి పర్సనల్ సెక్రటరీగారూ, ఈ కుర్రాడు ఇక్కడే వుంటాడు గదూ?
పాంచజన్యం: ఆ! ఆ! వుంటాడు, వుంటాడు. ఇక్కడే వుంటాడు.
సుదర్శనం: గజలక్ష్మీ!...అయిదువేలు...
గజలక్ష్మి: నా దగ్గర్లేవు.
పాంచజన్యం: (గుసగుసగా) పోనీ ఇచ్చేయ్ రాదూ? పీడా విరగడౌతుంది.
సుదర్శనం: పోనీ, మీ ఆయన బీరువా తాళం చెవులిట్లా ఇచ్చేయ్! నేనే చూసుకుంటాను, కావలసింది తీసుకుంటాను.
గజలక్ష్మి: నాదగ్గర్లేవు.
పాంచజన్యం: ఇచ్చేయ్ గజలక్ష్మీ!
సుదర్శనం: ఇచ్చేయ్ గజలక్ష్మీ!
చక్రధరం: ఇచ్చేయండి మేడమ్! చిన్నయ్యగార్నిబ్బంది పెట్టకండి.
గజలక్ష్మి: లేవు...లేవు...లేవు...నాదగ్గర లేవంటే నమ్మరేం? బీరువా తాళం చెవులు తీసుకెళ్ళి బ్యాంకులో లాకర్లో పెట్టొచ్చాడా ముసలాయన. ఇంట్లో వుంటే నేనెక్కడ మింగేస్తానో అని!!
సుదర్శనం: అని నన్ను నమ్మమంటావా గజలక్ష్మీ? నేను లేకుండా చూసి ఆస్తంతా కొట్టేద్దామని గుంటకాడి నక్కలాగా ఆయన దగ్గర కనిపెట్టుకుని కూర్చున్నావ్-నువ్వా తాళం చెవుల్ని అంత సులభంగా గడప దాటి బయటికి పోనిస్తావా? నేన్నమ్మను.
గజలక్ష్మి: నమ్మినా, నమ్మకున్నా నిజం నిజమే! నా దగ్గర తాళాల్లేవు, డబ్బు లేదు.
సుదర్శనం: అయితే ఆ ముసలాయన్నే అడుగుతాను. ఒరేయ్ చక్రధరం, మీ అయ్యగారు వైకుంఠంగారికి సరిగా వినపడదు గానీ, కొంచెం గొంతెత్తి పెద్దగా పిలవరా! (మెల్లగా) నా గొంతు నలుగురికీ వినబడడం నాకిష్టం లేదు.
(చక్రధరం, వైకుంఠం కూర్చున్న కుర్చీ దగ్గరకు వెళ్ళి వినగ్గా నిలబడతాడు చేతులు కట్టుకుని ముందు మెల్లగా "అయ్యా, బాబుగోరూ, పెదబాబుగోరూ, వైకుంఠం గారూ అంటూ మొదలుపెట్టి క్రమంగా స్థాయి పెంచుతాడు. వైకుంఠం గారూ, వైకుంఠం గారూ, వైకుంఠం గారూ అంటూ రంగస్థలమంతా ప్రతిధ్వనులు. అయినా వైకుంఠం గారిలో చలనం లేదు. చక్రధరం గొంతు క్రమంగా దిగిపోయి, నీరసంగా అతను కింద కూలబడతాడు)
గజలక్ష్మి: అర్థమైందా ఇప్పుడు, ఆయనతో నేనెట్లా వేగుతున్నానో! ఎంత నరకం అనుభవిస్తున్నానో! లేవలేడు. మాట్లాడలేడు. తిండి సరిగా తినలేడు. తింటే హరాయించుకోలేడు. ఎవరు మాట్లాడుతున్నారో కనిపించదు. ఏం మాట్లాడుతున్నాడో తెలీదు. ఈ నరకంలో ఇన్నాళ్ళు ఆయన్ని కనిపెట్టుకుని, కంట్లో వత్తు లేసుకుని కాపాడుతూ వస్తే, ఇప్పుడు నువ్వు జైల్లో నుండి వూడిపడి, డబ్బు డబ్బంటూ అంగలార్చడం చూస్తుంటే, ఛా, ఛా నీమీద నాకున్న అసహ్యం ఎక్కువౌతున్నది.
సుదర్శనం: నాది కాని దానికోసం నేనేమీ అంగలార్చడం లేదు. ఆస్తిలో నాకూ వాటా వుంది. నా వాటా లోంచే పోనీ ఎడ్వాన్సుగా ఇమ్మంటున్నాను. మా రివల్యూషనరీ ఎసోసియేషన్ మెంబర్లలో ఒకతనికి జబ్బుచేసింది. ట్రీట్‌మెంట్‌కి డబ్బు కావాలి.
గజలక్ష్మి: ఇంట్లోంచి డబ్బెత్తుకుపోయి, బజార్లలోపడి విప్లవం అంటూ కేకలేస్తూ తిరిగే ప్రతి జులాయి రివల్యూషనరే!
సుదర్శనం: (పెద్దగా) గజలక్ష్మీ! ఆడదానివి కనక ఈ మాట అని కూడా బతికిపోయావ్! తెల్లవాడు వాడు విన్ను భగత్సింగన్నాడు, నల్లవాడు నేడు నిన్ను నక్సలైటన్నాడు, ఎల్లవారు నేడు రేపు వేగుచుక్కలంటారు. అన్నాడో మహాకవి. మేం భగత్సింగులం, నక్సలైట్లం, వేగు చుక్కలం.
చక్రధరం: అంటే ఎవరు బాబూ?
సుదర్శనం: నీలాంటి అనాథల్ని ఆదుకొనేవాళ్ళు. దగాపడ్డ కర్షక, కార్మికుల కన్నీరు తుడిచి, ఆశ్రయం కల్పించేవాళ్ళు. దోపిడీ దొంగల్ని, సంఘ విద్రోహుల్ని పట్టి పల్లార్చేవాళ్ళు.
గజలక్ష్మి: కానీ నువ్వే నేరం మీద జైలుకెళ్ళావో జ్ఞాపకం వుందా?
సుదర్శనం: ఎవరు పంపించారో కూడా బాగా జ్ఞాపకం వుంది. నువ్వు ఆడదానివైపోయావు కనుక బతికిపోయావు. మా ఉద్యమకారులు, తాటకినీ, మంథరనూ, శూర్పణఖనూ కూడా క్షమిస్తారేతప్ప వాళ్ళమీద ప్రతీకారం తీర్చుకోరు.
గజలక్ష్మి: అయితే ఇహనేం, తక్షణం వెళ్ళిపో ఇక్కడ్నుంచి నువ్వు. మీ నాన్నతో




నువ్వు మాట్లాడలేవు. ఒహవేళ ఆయన నీతో మాట్లాడ్డం అంటూ వస్తే గిస్తే ఆ కళ్ళల్లో నీ మీద ద్వేషం, కసి, కనిపిస్తాయ్ తప్ప అనురాగం, ఆప్యాయత కనిపించవు. ఆస్తిలో వాటా అంటావా, అదంతా నాకుతప్ప అందులో నీకు చిల్లిగవ్వ కూడా ముట్టదు.
సుదర్శనం: నాకు కావలసింది నన్ను తీసుకోనీకుండా ఆ బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు. (వైకుంఠం కూర్చున్న కుర్చీ దగ్గరకు వెళ్ళి, వినగ్గా నిలబడి) ఇంత జరుగుతున్నా ఇటువేపు చూడవేం? సర్! నా మాటలు నచ్చక, నా చేతలు గిట్టక ఆ రోజున ఇంట్లోంచి నన్ను వెళ్ళిపొమ్మన్నావ్. కాదన్నందుకు దొంగతనం నేరం మోపావ్! వయసు పెళ్ళాం మోజులోపడి ఆ రాజరాజ నరేంద్రుడు తన కన్న కొడుకు కాళ్ళూ చేతులూ నరికిస్తే నువ్వు నన్ను జైల్లో తోయించి అడ్డుతొలగించుకున్నావ్! బట్! మై డియర్ అండ్ రెస్పెక్టెడ్ ఫాదర్ మిస్టర్ వైకుంఠం! నన్ను కన్నందుకు నీ ఆస్తిలో నాకు వాటా ఇచ్చి తీరాలి. ఆ ఆస్తిని నేను నా సంఘానికి దానం చేసి తీరాలి.
గజలక్ష్మి: అట్లా నేను నిన్ను చెయ్యనివ్వను. (ముందుకు వస్తుంది ఆవేశంగా)

పత్రికా ప్రపంచంలో
అపూర్వం - అద్భుతం

కధాకళి

సంచలన పక్ష పత్రిక
ఎక్కడా లేదు! ఎప్పుడూ లేదు!
ఇదే ప్రథమం!

కధాకళి ప్రతి సంచికలో
రెండు పూర్తి నవలలు

ప్లస్: కథలు, కార్టూన్లు, జోకులు
సినిమా స్పెషల్ వగైరా..

ప్రతి సంచికా ఒక ప్రత్యేక సంచికే!
కార్యాలయం: 1-8-703/6 నల్లకుంట, హైదరాబాద్.


సుదర్శనం: అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేవు.
గజలక్ష్మి: నువ్వు సూర్యకాంతివి కావు. జిల్లేడు మొక్కవు. పాంచజన్యం! అట్రా! చెయ్యి ఇయ్యి! ఇద్దరం కలిసి ఇతగాణ్ని బయటికి తోసి తలుపుల గడియేసేసి, పోలీసులకు ఫోను చేద్దాం పట్టు.
సుదర్శనం: ఒరేయ్, చక్రధరం, నువ్విట్రారా! స్టాప్ దెమ్!

(రంగస్థలం మీద కాసేపు గడబిడ. ఒకరి పట్టులోనుంచి మరొకరు విడిపించుకోవాలన్న ప్రయత్నం. గజలక్ష్మి సుదర్శనాన్ని, సుదర్శనం పాంచజన్యాన్ని, పాంచజన్యం చక్రధరాన్ని, చక్రధరం గజలక్ష్మిని, వాహిరి చేతుల్లో మరొహరు. ఆ సమయంలో—
బయటి నుంచి నల్లకోటు నాగేశ్వరం లోపలకు వస్తాడు. మధ్య వయసులో వున్న మనిషి. నల్లటి మొహంమీద తెల్లటి మీసాలు ధోవతిలో చొక్కా టక్‌చేసి, వెడల్పాటి బెల్టు పెట్టి, గుండీల్లేని ఓ పాత నల్లకోటు తొడుక్కున్నాడు. కాళ్ళకు టైరు చెప్పులు, మెళ్ళో టై, చంకలో గొడుగు, కళ్ళకు దళసరి అద్దాలు, మాటల్లో నేసల్ ట్వాంగ్)

నల్లకోటు నాగేశ్వరం: అయ్యా-వైకుంఠంగారూ! అమ్మా గజలక్ష్మమ్మా! నా పేరు నాగేశ్వరం అంటారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే నల్లకోటు నాగేశ్వరం అంటారు. నల్లకోటు అని ఎందుకనా...ఇదిగో ఇందుకూ-ఈ నల్లకోటు తొడుక్కున్నందుకు ఒక్క స్నానం చేసేటప్పుడు తప్ప సర్వకాల సర్వావస్థల్లోనూ ఈ నల్లకోటు నా శరీరం మీద వుండి తీరవలసిందే-అందుకని మా ఇంటిపేరు తీసేసి దాని స్థానంలో అందరూ ఈ నల్లకోటును తగిలించేశారు. ఎట్లాగూ ఆ పేరిచ్చేశారు కదా అని అన్నంతినేటప్పుడూ, వీధిలో కొచ్చినప్పుడు-ఊరి కెళ్ళేటప్పుడు, నిద్రపోయేటప్పుడు, పగలు, రాత్రీ కర్ణుడికి కవచ కుండలాలులాగా ఈ నల్లకోటు నా శరీరంలో ఓ విడదీయరాని భాగమైపోయిందనుకోండి.
(నల్లకోటు నాగేశ్వరాన్ని చూసి వున్న నలుగురూ అటూ ఇటూ హడావిడిగా సర్దుకున్నారు. ఏమీ జరగనట్టుగా నిలబడ్డారు. అతని మాటలు విని అర్థం కానట్టు అయోమయంలో పడ్డారు. చక్రధరం మాత్రం ఆ మాటల్ని ఎంజాయ్ చేస్తూ—)

చక్రధరం: అయితే నాగేశ్వరం గారూ! మీ నల్లకోటు ఇస్త్రీకి వెయ్యరా?
నాగేశ్వరం: ఇంత వరకూ వేసిన జ్ఞాపకం లేదోయ్! (సుదర్శనాన్ని చూస్తూ) అన్నట్టు నువ్వు వైకుంఠంగారి అబ్బాయివి కదూ, సుదర్శనానివి. (వేలును చూపిస్తూ) ఇంతప్పుడు చూశాను. ఒరే వేలూ అని పిలిచేవాళ్ళం, ఇవాళేమో గెడకర్రలా ఎదిగిపోయావ్! మీ పిన్ని-నువ్వూ పాపం, వైకుంఠంగారికి మీ రిద్దరూ రెండు కళ్ళుగదా! పెద్దవాడైపోయినాడయ్యా మీ నాయన! అమ్మా-గజలక్ష్మమ్మా-నిన్ను చూస్తే నా కడుపు తరుక్కు పోతోంది తల్లీ! కట్టుకున్నవాడు చూడబోతే ఆవిధం, కడుపున కనకపోయినా కొడుకన్నవాడు ఈవిధం! అదే గొడవ పెట్టాడు వైకుంఠం మొన్న మా ఇంటికి వచ్చి!! ఇవ్వాళ వచ్చి తీరాలి అన్నాడు. ఎక్కడికని అడగవేం? ఇదిగో ఇక్కడికి!! మహానుభావా! వైకుంఠంబావా! నేను నోటరీని, లక్షమంది నా దగ్గరకు వస్తుంటారు, లేదా నేనే లక్షమంది దగ్గరకు వెళ్తుంటాను, అది నా వృత్తి ధర్మం, నువ్వన్నట్టుగా మీ ఇంటికి రావడం పడదూ అన్నాను. వృత్తి ధర్మం మీదే రావోయ్! అన్నాడు. ఎందుకోయ్ అన్నాను. వచ్చి మా ఆవిడతో మాట్లాడు అన్ని విషయాలూ అన్నాడు. సరే అని వచ్చాను. తీరా వొస్తే మీరు నలుగురూ నాలుగు దీపపుసెమ్మెల్లాగా, నాలుగు వేపులా నిలబడి పోయారు. వైకుంఠం బావా, నువ్వు రమ్మన్నట్టుగా వచ్చాను. మీ ఆవిడ్ని అడగమన్నావు కదూ, అడిగేస్తున్నాను. ఏవమ్మా, ఏవిటినీ అభిప్రాయం?
గజలక్ష్మి: బాబుగారూ, అలిసి పోయినట్టున్నారు, కాస్త కాఫీ పుచ్చుకుంటారా?

పాంచజన్యం: లోపలకు వెళ్ళి, స్వీట్లేవో వున్నాయన్నావుగా, అవి పట్టుకొచ్చి పెట్టరాదూ?

సుదర్శనం: అయ్యా! నోటరీగారూ! నా దగ్గర ఫిల్టర్ చేయని చార్మినార్ సిగరెట్లున్నాయి కాలుస్తారేమిటి?

చక్రధరం: బాబూ చెప్పండి, ఏం కావాలో, కాఫీయా, స్వీట్లా, సిగరెట్లా...? నిముషంలో రెడీ చేసేస్తాను.

పాంచజన్యం: మర్యాదలైంతర్వాత, మహాలక్ష్మి వంటి గజలక్ష్మిగారి అభిప్రాయం కనుక్కుందురుగాని!

సుదర్శనం: ఆ అభిప్రాయం ఆస్తి విషయంలో అయితే, మీరేమి శ్రమ పడనక్కర్లేదు. ఉన్నదంతా ఫిఫ్టీ-ఫిఫ్టీ!

గజలక్ష్మి: లేదు. మావారి అభిప్రాయం అది కాదు. విల్లు తిరగరాసి, అంతా నా పేరనే పెట్టమన్నారు.

సుదర్శన్: అదేం కుదరదు. విల్లు తిరగ రాయడానికి వీల్లేదు.

గజలక్ష్మి: తిరగరాసి తీరవలసిందే!

సుదర్శనం: ఇంపాజిబుల్!

గజలక్ష్మి: వెరీమచ్ పాజిబుల్!




పాంచజన్యం: తిరగరాసి తీరవలసిందే!

చక్రధరం: రాయడానికి వీల్లేదు.

పాంచజన్యం: నువ్వెవడ్రా మధ్యలో మాట్లాడడానికి?

చక్రధరం: అసలు మీరెవరండీ! వాళ్ళ విషయంలో కలగజేసుకోడానికి?

పాంచజన్యం: నేను వాళ్ళ పర్సనల్ సెక్రటరీని!

చక్రధరం: నేను వాళ్ళ పర్సనల్ అసిస్టెంటును.

గజలక్ష్మి: పసీ, యు ఆర్ డిస్మిస్డ్! గెట్అవుట్!

సుదర్శనం: ప సీ... యూ ఆర్ రీఇన్‌స్టేటెడ్! డోన్ట్ గో అవుట్!

నల్లకోటు నాగేశ్వరం: ఆపండి, ఆపండి, మీరంతా ఆ చేపల మార్కెటుగోల! వైకుంఠం బావా, మాశావా వీళ్ళను, కాపాడరావా నన్ను వీళ్ళనుంచి. తల్లీ బిడ్డలకు పడదు, యజమానికీ నౌకరుకూ పడదు, ఈ నల్లకోటు ఎదురుగా వుంటేనే మీరు నగుబాటు పాలవుతున్నారు. నల్లకోట్లు లేకపోతే—

సుదర్శనం: (తీవ్రమైన కంఠంతో) మీ నల్ల కోట్లకు, న్యాయ చట్టాలకు, మీ దొంగ నీతులకు, మీ కుహనా రాజకీయాలకు నేను ఈషణ్మాత్రం కూడా గౌరవం ఇవ్వను. నీకు న్యాయమనుకున్నదాన్ని, నాకు హక్కున్న దనుకొన్నదాన్ని, అవసరమైతే బల ప్రయోగం చేసయినా సరే సాధించుకుంటాను. ఈ ఆస్తి ఆ ముసలాయనది, ఆ ముసలాయన కొడుకును నేను. నన్ను కన్నందుకు ఆస్తిని నాకు ఆయన ఇచ్చి తీరాలి.

గజలక్ష్మి: కట్టుకున్న దాన్ని నేను! నే చేసిన సేవలకు ఆస్తంతా నాకు పూర్తిగా రాసిచ్చినా నా ఋణం ఇంకా తీరదనుకున్నాడాయన. జైలుకెళ్ళొచ్చిన కొడుక్కి గనుక వాటా పెడితే, అది హారతి కర్పూరం అయిపోతుందని ఆయన భయం.

సుదర్శనం: అట్లా అని నీతో చెప్పాడా?

గజలక్ష్మి: అట్లా కాదని నీతో చెప్పలేదుగా?

సుదర్శనం: ఇప్పుడు చెప్పిస్తాను.

గజలక్ష్మి: చెప్పించలేవు.

సుదర్శనం: అంత విషం మారిపోశావా నామీద ఆయనకు?

గజలక్ష్మి: చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అన్నారు.

నల్లకోటు నాగేశ్వరం: మళ్ళీ మొదలైంది మీ ఇంటి సంగ్రామం. వైకుంఠం బావా, నల్లకోటును గౌరవించడం వీళ్ళకు తెలీదు. నే చెయ్యను వీళ్ళిద్దరి మధ్యా రాజీ! ఇదిగో నీ వీలునామా! అందరూ మళ్ళీ ఒక అంగీకారానికి వస్తే గిస్తే, అయితంపూడి కరణీకం అయితే గియితే అన్నట్టుగా, నాకు కబురు పంపించండి వస్తాను, పని పూర్తిచేస్తాను. వచ్చేటప్పుడే 'వెళ్ళొద్దురా అక్కడికి' అన్నాడు మా సీనియర్ పార్ట్‌నర్. అయినా వచ్చాను వైకుంఠం నీమాట కాదనలేక! చూశాను ఈ కప్పల తక్కెడ వ్యవహారం! ఇక్కడ నేను ఇహ ఒక్క క్షణం కూడా వుండను! ఇహ నేను వెళ్తున్నాను. మీ చావేదో మీరు చావండి, ఈ గొడవలూ, కషభిషలూ నాకు నచ్చవు.

గజలక్ష్మి: నా వ్యవహారం తెమల్చకుండానే వెళ్ళిపోతారా?

సుదర్శనం: నా సంగతి ఒక కొలిక్కి రాకుండానే తోక ముడుస్తున్నాడే?

(నాగేశ్వరం వైకుంఠం దగ్గరకు వెళ్ళి, వైకుంఠం కుర్చీని గిర్రున తన వేపుకు తిప్పుకున్నాడు. అది ఓ రౌండు తిరిగి మళ్ళీ యథా స్థానంలోకే వెళ్ళి ఆగింది. వైకుంఠం తలా, వీపు మళ్ళీ కనిపిస్తున్నాయి. నాగేశ్వరం వైకుంఠం వెనగ్గా నిలబడ్డాడు. అతని బుజాల మీద స్ట్రోక్ చేస్తూ మాట్లాడుతున్నాడు)

నల్లకోటు నాగేశ్వరం: బావా, వైకుంఠం బావా! మళ్ళీ వీలున్నప్పుడు వస్తాను, ఏమనుకోకు వెళ్ళొస్తాను. నీ ఆరోగ్యం జాగ్రత్త. కంగారేం పడక, నీ ఇష్టప్రకారమే చేద్దాంలే! తొందరేముందీ? ఈసారి మా సీనియర్ పార్ట్‌నర్‌ని పంపిస్తాలే! వాడైతే కట్టె కొట్టె తెచ్చె అన్నట్టుగా అంతా మూడు ముక్కల్లో తేల్చేస్తాడు. నల్లకోటు వేసుకున్నా నాది మెతకగుండె బావా! ఖరాఖండిగా వుండలేను. ఈ వుండలేకపోవడాన్ని మా ఆవిడ కూడా దెప్పిపొడుస్తున్న దయ్యా! వెన్నపూసలాంటి గుండె పెట్టుకుని ఇనపగుండు లాంటి ఆ నల్లకోటెందుకండీ మీ వెన్నుపట్టె మీద? అంటుందావిడ. కానీ ఆడవాళ్ళకేం తెలుసు బావా, నల్లకోట్ల విలువ? ఈనల్లకోట్లే కదూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ముందు వరసలో నిలబడి బ్రిటీషువాళ్ళ లాఠీ దెబ్బలను పూల హారాల్లా తమ మెడల్లో వేసుకున్నదీ?

పాంచజన్యం: నాగేశ్వరం గారూ, అవతల తమకేదో పనుందన్నారు?

నాగేశ్వరం: అవునవును. ఉంది వుంది. గుర్తుచేసి మంచి పనిచేశావు. అన్నట్టు నువ్వు మా వైకుంఠం బావగారికి సెక్రటరీ నన్నావ్ కదూ? బీ వెరీ కేర్‌ఫుల్? ఆయనకు వేళకు అన్నీ అమరుతున్నవో లేదో జాగ్రత్తగా చూసే భారం నీదే! ఆయన మనస్సు తెలుసుకుని ప్రవర్తిస్తూ వుండాలి నువ్వు. అమ్మా గజలక్ష్మమ్మా! నాయనా సుదర్శనం! అదిగో విల్లు! మరి నే వెళ్తున్నా! (చక్రధరాన్ని చూస్తూ) ఒరేయ్ అబ్బాయి, నువ్వు నాతో అందాకా రారా! మన మున్సిపాలిటీవారు పౌర్ణమినాడు పట్టపగల్లా దీపాలన్నీ వెలిగిస్తారు, అమావాస్యనాడు ఆదా అంటూ అన్ని దీపాలూ ఆర్పేస్తారు.

సుదర్శనం: వెళ్ళిరా చక్రధరం!

చక్రధరం: పదండి బాబుగోరూ!

నల్లకోటు నాగేశ్వరం: పద. వస్తానయ్యా! వస్తానమ్మా! ఏమయ్యా సెక్రటే-

జాగర్తా...

(వల్లకోటు నాగేశ్వరం, చక్రధరం బయటకు వెళ్ళిపోయారు. వాళ్ళటు వెళ్ళగానే సుదర్శనం పులిలా లంఘిస్తాడు విల్లు మీదకు. గజలక్ష్మి అడ్డుకుంటుంది. ఆ గొడవలో పాంచజన్యం దాన్ని తన చేజిక్కించుకుంటాడు)

పాంచజన్యం: సుదర్శనం, నువ్వు మిస్ బిహేవ్ చేస్తే ఈ విల్లుకాస్తా చింపేస్తాను.

సుదర్శనం: చింపేసుకో! విల్లునంటే చింపేయగలవ్ కానీ, ఆస్తిని కొట్టేయలేవు గదా?

పాంచజన్యం: నేనూ, గజలక్ష్మి...సారీ గజలక్ష్మిగారూ తల్చుకుంటే అదెంతపని? నిముషం. కానీ ఇపుడా ఆలోచనలేవీ వద్దు. మీలో మీకు గొడవలు వద్దు. ముందుగా విల్లులో ఏముందో తెలుసుకోండి. వైకుంఠంగారి ఆస్తిలో మీకేదన్నా వాటా వస్తే, అది హామీగా గజలక్ష్మిగారి దగ్గర్నుండి కావలసిన డబ్బు తీసుకుని మీరు వెళ్ళిపోండి. అటు యథాప్రకారం మీ ఉద్యమం మీకు, మామూలుగా ఈ ఇంటి తిప్పలు మాకు. సెక్రటరీగా నాకు తోచిన ఆలోచన ఇది. ఆ తర్వాత తమ ఇష్టం.

సుదర్శనం: ఓ.కే. ఆ విల్లులో ఏముందో చదువు.

పాంచజన్యం: (చదువుతూ) పాల సముద్రం వైకుంఠం అనే నేను, ఆరోగ్యం తోనూ, తెలివితోనూ వుండి స్వదస్తూరీతో వ్రాసి ఖరారు చేయునది ఏమనగా నాకు గల ఆస్తి యావత్తూ నా స్వార్జితం అయినప్పటికీ, నా భార్యా బిడ్డలయందు నాకుగల మమకారం కారణంగా సదరు ఆస్తిని ఈ కింది విధంగా పంపకం చేయుచున్నాను.



ఇపుడు మేము వుండుకుంటున్న ఈ ఇల్లు నా తదనంతరం నా కుమారుడైన సుదర్శనానికి, ఈ ఇంటి ముందుగల సమస్తమైన సామాగ్రితోనూ చెందవలసి యున్నది. పడమటి వీథిలోగల రెండంతస్థుల బంగళా, దాని నానుకునివున్న తోట, కాలనీ అవతల వున్న పల్లపు పొలం నలభై ఎకరాలు నా భార్యకు చెందవలసి యున్నవి. నా కుమారునికి తూర్పు వీథిలో వున్న ఖండసారీ చక్కెర ఫ్యాక్టరీ, దక్షిణం వీథిలో వున్న ఐస్ ఫ్యాక్టరీ దేఖలు పడవలసి యున్నది. ఆంధ్రా బ్యాంకులో వున్న ఫిక్సెడ్ డిపాజిట్లు నా భార్యకు, స్టేట్ బ్యాంకులో వున్న కరెంట్ ఎక్కౌంట్ మొత్తం నా కుమారుడికి అందవలసి యున్నవి.

సుదర్శనం: ఆగండి, ఇవన్నీ ఆయన తదనంతరమేగా!

పాంచజన్యం: ఆహా! ఆయన తదనంతరమే!

సుదర్శనం: అయితే ఇపుడు తెలుసుకుని ప్రయోజనం ఏమిటి?

గజలక్ష్మి: ప్రయోజనం అంటే నీకు డబ్బేగా?

సుదర్శనం: అవును...డబ్బే! నా సంఘం కోసం, నా ఉద్యమం కోసం నాకు తక్షణం డబ్బు కావాలి. తక్షణం కనీసం అ...యి...దు...వే...లు! అది నువ్వు ఇచ్చి తీరాలి.

గజలక్ష్మి: ఆడదాన్ని నన్ను యాచించకపోతే, మగాడివి ధైర్యంచేసి నువ్వే సంపాదించుకోవచ్చు కదా?

సుదర్శనం: ఎట్లా?

గజలక్ష్మి: ఇట్లా (అంటూ వైకుంఠాన్ని ఖతమ్ చేసే భంగిమ చూపిస్తుంది) అపుడు

ఆయన కరెంట్ ఎక్కౌంట్‌లో వున్న డబ్బంతా నీదే! ఫ్యాక్టరీలు నీవి, ఈ ఇల్లు నీది!

పాంచజన్యం: (మెల్లగా) గజలక్ష్మీ! ఆ సలహా ఏమిటి?

గజలక్ష్మి: ఉష్! పిట్ట ఉచ్చులో చిక్కితే దాని రెక్కలు కత్తిరిస్తాను.

సుదర్శనం: నన్ను టెంప్ట్ చేస్తున్నారా?

గజలక్ష్మి: కాదు, నీ ఉద్యమానికి యథా శక్తి ఉడుతా భక్తిగా సాయం చేస్తున్నాను. ఆ కుర్చీలో పడుకున్న ముసలాయనకు చావన్నది కొన్ని నెలలు, ఆయన బతికుండడు. ఎవరికి లాభం? తన తిండి తాను తినలేనివాడు, తన బట్ట తాను కట్టలేనివాడు, ఉన్నవారికి బరువు కాదూ? ఆయనే కన్నుమూస్తే ఆ డబ్బుతో నువ్వు తిమ్మిని బమ్మిచేయవచ్చు. ఆలోచించు. ఎండిపోయి వరుగైపోయిన పండును కొమ్మనుండి తుంపేస్తే కొమ్మకేం బాధ? బీటలువారి కప్పు కుంగిన ఇంటిని కూల్చివేస్తే అధర్మం ఏమిటి? ఎముకలు కుళ్ళి, వయస్సు మళ్ళినవాళ్ళను చావమని మీ మహాకవేగా ఉద్బోధించాడు? ఇందాక నువ్వేగా అన్నావ్, న్యాయ మనుకున్నదాన్ని, దక్కున్న దనుకొన్నదాన్ని, అవసరం అయితే బల ప్రయోగం చేసైనా సరే సాధించుకుంటానని! ఊ! సాధించుకో! నీ ఉద్యమం కోసం తండ్రయ్యేది, తల్లయ్యేది అడ్డు తొలగించుకో! ఎంతకాలం ముసలివాళ్ళు ఈ



దేశంలో: మన ఇళ్ళల్లో అధికారం చెలాయించేది? ముసలితనానికి భరతం పట్టు యువతకు దీపం పెట్టు.

సుదర్శనం: (నిదానంగా) ఎందుకు నీకా ముసలాయన మీద ఇంత కసి?

గజలక్ష్మి: కసి?! (పిచ్చిదానిలా నవ్వుతుంది) కసిగాదు, ఇది నా జీవితాన్ని నూసి నేనే ఏడుస్తున్న ఏడుపు. నువ్వు గనక ఓ ఆడదానివిగా పుట్టుంటే ఆ ఆడదాన్ని మీ నాన్న వయసువాడు పెళ్ళాడివుంటే, అపుడు తెలిసేది నా ఏడుపేమిటో నీకు? కళ్ళెదురుగా వున్న నాలాంటి ఆడదాన్ని అర్థం చేసుకోలేవు కాని, ఉద్యమం నడుపుతావుట, ఉద్యమం!! దమ్ముంటే, నువు నమ్మిన ఆ విప్లవం కోసం, అన్యాయమైపోయిన నా బతుకు కోసం...

సుదర్శనం: ఆ స్థితిలో అంత వాటా ఇచ్చిన మనిషిని గూర్చి నువ్విట్లా అనడం...

గజలక్ష్మి: ఉన్నవాడు తన ఉంపుడుకత్తెకు అంతకన్నా ఎక్కువ ఇస్తాడు! ఇదో పెద్ద ఇవ్వటం కింద లెక్కా? నా నుంచి తాను పొందాలనుకున్న శరీర సుఖానికి అది ఖరీదు. మరి నే చేసిన చాకిరీకి విలువేదీ? అందుచేత చెప్పమరి, నే చెప్పిన పని నువ్వు చెయ్యగలవా?

సుదర్శనం: దట్స్ నథింగ్!

గజలక్ష్మి: అయితే ఆలస్యం ఎందుకు? కానీ...!

సుదర్శనం: కానీ మా ఉద్యమకారులు, ఆడవాళ్ళలాగానే ముసలివాళ్ళమీదా, పసి పిల్లల మీద కూడా హింసను ప్రదర్శించరు.

గజలక్ష్మి: ఛీ! ఆదర్శం చాటున పిరికితనాన్ని దాచుకోకు

సుదర్శ~~: పిరికితనం కాదు. మానవత్వం!

గజలక్ష్మి: సరే! నీ మానవత్వం నీది, నా దాన వత్వం నాది! కోర్కెల మంటల్లో నా నిండు జీవితాన్ని బుగ్గిచేసిన మీ నాన్నను దయగా చూడవలసిన అవసరం, ఆ విల్లులో ఏముందో తెలుసుకున్న తర్వాత కూడా ఇహ నాకు లేదు. ఎప్పుడో రావలసిన దానికోసం కన్నుల్లో వత్తులు వేసుకుని ఎదురుచూడవలసిన అవసరం, ఓపిక నాకు లేవు. మగవాళ్ళు, తండ్రైనా, కొడుకైనా, స్నేహితుడైనా, అందరూ ఒకటే. ఐ హేట్, మెన్! ఆడదానికి ప్రథమ శత్రువు మగవాడే! అంచేత...అంచేత...

(వైకుంఠం వైపు ఒక్క దూకు దూకుతుంది. వెనుక నుంచి అతని మీద తన రెండు చేతులూ వేసి అతని కంఠాన్ని గట్టిగా బిగిస్తుంది) చావు...చావు...చావు...

సుదర్శనం: (ఆమెవేపు పరుగెత్తుతాడు) వద్దు...వద్దు గజలక్ష్మీ! వద్దు. ఆ పని చేయకు. ఆ ముసలాయన్ని చంపకు.

పాంచజన్యం: గ...జ...ల...క్ష్మీ...

గజలక్ష్మి: పాంచజన్యం! స్టాప్ దట్ ఫూల్ సుదర్శనం! (పాంచజన్యం స్థాణువులా నిలబడిపోతాడు)...క్విక్

పాంచజన్యం: గజలక్ష్మీ! గజలక్ష్మీ! నాకు రేసులకు, క్లబ్బులకు, పార్టీలకు డబ్బు వద్దు. ఐ ప్రామిస్ - ఇటుపై నిన్ను నేను ఇబ్బంది పెట్టను. ఆ పని మానేయ్! నీ చేతుల్ని పాపంతో మలినం చేసుకోకు. హంతకురాలివి కాబోకు

గజలక్ష్మి: పాంచజన్యం! ఏం చూస్తున్నావు నువ్వు? హత్య చేస్తున్న దెవరు? సుదర్శనం!! ఎందుకు? ఆస్తి మొత్తం తనకు రాలేదని!! అర్థమైందా?

(గభాలున తన చేతుల్ని విడదీసేస్తుంది. చీర చెంగు రెండు ముక్కలుచేసి వాటిని. వేళ్ళకు చుట్టుకుని మళ్ళీ వైకుంఠం కంఠాన్ని పట్టుకుంటుంది)

ఇపుడు నా చేతి ముద్రలు కూడా పడవు. భయపడకు.

సుదర్శనం: (ఆమె కుట్ర అర్థమై, ఆమె మీదకు దూకుతూ) యూ, డెవిల్!

(ఆమెను ఇవతలకు లాగేశాడు. గట్టిగా పట్టుకున్నాడు)

గజలక్ష్మి: (పిచ్చిగా నవ్వుతూ) నన్ను డెవిల్ అను, బిచ్ అను, నాకేం ఫర్వాలేదు. కానీ నన్నూ నిన్నూ సమానం చేసి విల్లు వ్రాసిన ఆ ముసలివాణ్ణి మాత్రం నేను క్షమించలేను. ఐ విల్ కిల్ హిమ్. ఐ విల్ కిల్ హిమ్! నేను చంపుతాను, నువ్వు ఉరికంబం ఎక్కుతావు. (పెద్దగా) నేను చంపుతాను, నువ్వు ఉరికంబం ఎక్కుతావు. (హిస్టీరికల్‌గా) ఉరి! ఉరి! నా గొంతుక్కి ఈ మంగళ సూత్రం ఓ ఉరి. ఈ ఇల్లో బలిపీఠం. మీ నాయనో కాలయముడు. నాకు జీవితమే ఒక శాపం. కన్న తండ్రే ఓ కసాయి వాడికి అమ్మేశాడు నన్ను. పుట్టి పెరిగిన సమాజమే సంప్రదాయం పేరుమీద నన్నో గాటకు కట్టివేసింది. తాళి కట్టినవాడే నన్నో బానిసను చేశాడు వెట్టి చాకిరికి. మనసు పడ్డ మగవాడే నన్నో బంగారు గుడ్ల బాతుగా మార్చుకున్నాడు. భగవంతుడా! ఎందుకు సృష్టించావు నన్ను? (ఏడుస్తూ) ఆడదాన్నిగా, కూతురిగా, భార్యగా, ప్రియురాలిగా, ఎందుకన్యాయం చేశావు నాకు?

(బయటి నుంచి మాత్రల మహేశ్వరం ప్రవేశం. టిపికల్ విలేజ్ క్వాక్. రెండు బుజాలకూ రెండు చిన్న పెట్టెలు వేలాడుతున్నాయి. రంగు రంగుల జుబ్బా, తెల్ల పైజామా తొడుక్కున్నాడు. చేతులకు కడియాలున్నాయి. జుట్టు ముడి. నొసటన విభూతి రేకలు- మధ్యలో గంధాక్షతలు. కొంచెం బొంగురు గొంతు)

మాత్రల మహేశ్వరం: అయ్యా- పాలసముద్రం వైకుంఠం గారున్నారా లోపల?

గజలక్ష్మి: (సర్దుకుంటూ) ఎవరు నువ్వు?

మాత్రల మహేశ్వరం: మాత్రల మహేశ్వరాన్ని!!

సుదర్శనం: మాత్రల మహేశ్వరం అంటే ఇండియన్ ప్రైమ్ మినిష్టర్ రాజీవ్

గాంధీ అనుకుంటున్నావా, చెప్పగానే నలుగురికీ తెలిసిపోవటానికి? (విసుగ్గా) ఇంట్రడక్షన్ సరిగ్గా చేసుకోవయ్యా!

మాత్రల మహేశ్వరం: తమరేదో విసుగులో వున్నట్టున్నారు. విషయం మనవి చేసుకుంటాను. సావధానంగా చిత్తగించండి. ఈ రెండు పెట్టెలూ వున్నయ్ చూశారా, ఆ రెండూ నాకు అశ్వనీ దేవతలు అనుగ్రహించినవండి! అటు హిమాలయ పర్వతాల దగ్గర్నుండి ఇటు శ్రీశైలం అడవుల వరకూ వున్న కొండల్లో, కోనల్లో నాకు తెలియని చెట్లు లేవంటే నమ్మండి! వాటి ఆకులు, బెరడు, వేళ్ళు ఇవన్నీ చూర్ణం చేసి, మాత్రలుగా మార్చి ఈ పెట్టెల్లో నిక్షిప్తం చేశాను. వాత, పిత్త, శ్లేష వగైరా సమస్త ప్రకోపాలకూ నా మాత్రలు పనిచేసినట్లు సిద్ధ, యునానీ, అల్లోపతీ, హోమియోపతీ మందులు పనిచేయవంటే తవరు నమ్మి తీరాలి. నమ్మకపోతే ఆ మహేశ్వరుడి మీద ఒట్టు. కాళికా అమ్మవారి గుడిపక్కన, దాని చెట్టు కింద, లైన్లలో నిలబడ్డ వాళ్ళకు నేను మాత్రల వైద్యం చేయడం చూసి వైకుంఠంగారు కారుదిగి రాలేక డ్రైవర్‌తో కబురు చేశారు, వారం పది రోజులుపోయింతరువాత ఇంటికోసారొచ్చి కనబడమని. వారు చెప్పి నెల దాటింది. నాకు కాలు కదపడానికే కుదరకుండా వుండి తెముల్చుకుని వచ్చేసరికి ఇంత టైం పట్టింది. ఎక్కడ బాబూ వైకుంఠం గారు? తొందరగా చెప్పండి, వైద్యం చేసి వెళ్ళిపోతాను.

పాంచజన్యం: అదిగో, ఆ కుర్చీలో వున్నారు.

మహేశ్వరం: ఏం బాబూ, నీ గొంతు అట్లా వుంది? నీకూ ఓ మాత్ర ఇయ్యనేమిటి?

గజలక్ష్మి: నాకివ్వండి.

మహేశ్వరం: దేనికమ్మా?

గజలక్ష్మి: తొందరగా జుట్టు తెల్లబడి పోవటానికి, ఒంట్లో జవసత్వాలుడిగిపోవటానికి, మనసులో కోరికలు చచ్చిపోవటానికి!

మహేశ్వరం: అట్లాగే నమ్మా! కోరికలు పెరగడానికే కాదు, విరగడానికీ నాదగ్గర మందులున్నాయి.

సుదర్శనం: నాకూ ఇవ్వండి.

మహేశ్వరం: నీకు దేనికి బాబూ!

సుదర్శనం: ఒక్క గుద్దు గుద్దితే అవతలివాడు పచ్చడి పచ్చడి కావటానికి.

మహేశ్వరం: అట్లాగే బాబూ, ఆ మాత్రలూ వున్నాయి. శరీరాన్ని లోహ సదృశం చేసే మాత్రలు!

పాంచజన్యం: మాత్రల డాక్టర్గారూ, నాకూ కావాలి నీ మాత్రలు.

మహేశ్వరం: నీకెందుకుట?

పాంచజన్యం: ఊరపిచ్చుక లేహ్యంతో అవసరం లేకుండా వుండటానికి.

మహేశ్వరం: ఓహో! రతి క్రీడలో ప్రావీణ్యానికా? ఒక పెట్టెలో సహం మాత్రలు యివేనయ్యా! ఆశ్చర్యం ఏమిటంటే ఈ దేశం జనాభాలో ఎక్కువ మందికి ఈ మాత్రలే అవసరం అవుతున్నాయి ఈ మధ్య. నా మాత్రలు నాలుగు వేసుకోబాబు, నీ ముందు ఏ మగవాడూ బలాదూర్! ఇంతకీ అసలు రోగి ఏడీ? నేను ఎవరికోసం వచ్చానో ఆ వైకుంఠం మహాశయుడు-ఆయన కళ్ళు మిల మిల మెరిసిపోవాలిట. ఆయన చెవులు రేడియో రిసీవర్ సెట్లు కావాలిట. ఆయన కాళ్ళు మైళ్ళ దూరం నడిచినా ఉర్లు దిగనే దిగకూడదట.

గజలక్ష్మి: నిజంగా నీ మాత్రలు ఆయన్ని మామూలు మనిషిని చేస్తాయా?

సుదర్శనం: నిజంగా నీ మాత్రలు ఆయన జీవిత కాలాన్ని పొడిగిస్తాయా?

పాంచజన్యం: నిజంగా నీ మాత్రలలో ఆయన లేచి కూచుంటాడా?

మహేశ్వరం: మీరే చూస్తారుగా! ఇంతకీ ఆయనెక్కడ?

గజలక్ష్మి, పాంచజన్యం, సుదర్శనం: (ముగ్గురూ ఒకేసారి) అదుగో, ఆమూల, ఆ కుర్చీలో...

మహేశ్వరం: వైకుంఠం గారూ...అయ్యా వైకుంఠం గారూ! ఇటు తిరగండి స్వామీ! నా మాత్ర ఒక్కటి వేసుకుంటే...మహేశ్వరం! పోయే ప్రాణమైనా సరే తిరిగొస్తుంది. వైద్యో మహేశ్వరా హరా అన్నారు. నేను మహేశ్వరుణ్ణే బాబూ, ఇటు తిరగండిటు తిరగండి. తిరగరూ, సరే నేనే తమ వేపుకు వస్తున్నాను. (కుర్చీ అవతలివైపుకు వెళ్ళాడు. వైకుంఠం చెయ్యి పైకెత్తి నాడి చూడబోయాడు. గబుక్కున వదిలేశాడు) హర హరా! నా మాత్ర వేసుకోకుండానే వైకుంఠ యాత్రకు వెళ్ళిపోయావా వైకుంఠం! సరే, నీ దురదృష్టం. నీ శవాన్ని తాకి నేను మాత్రం మైలపడిపోయాను. వెళ్ళి తలారా స్నానం చేస్తేనే కాని ఈ మైల పోదు. నా మాత్రల పెట్టెలకు పుణ్యావచనం చేసుకోవాలి. ఒక పని చేశారయ్యా మీరు?

గజలక్ష్మి: ఏమిటీ! వైకుంఠంగారు చ...ని...పో...యా...రా...?

మహేశ్వరం: ఆహా! ఓ అరగంట పైనే అయ్యుంటుంది.


సుదర్శనం: ముసలాయన...ముసలాయన మరి లేడా?

పాంచజన్యం: మే హిజ్ సోల్ రెస్ట్ ఇన్ పీస్!!

మహేశ్వరం: నే వెళ్తున్నాను. మాత్రలు కావాలన్నారుగా, ఈ మైల గుడ్డల్తో కాదు. మైలస్నానాలు అయిపోయింతర్వాత, అపుడు రండి. సెలవ్!!

(వెళ్ళిపోతాడు)

(రంగస్థలంమీద ముగ్గురూ ఒక్క క్షణం అచేతనంగా నిలబడిపోయారు. మొహాలమీద లైటు ఫోకస్ చేస్తే, అవి కదులుతున్న ఆలోచనల కేంద్రాలుగా కనిపిస్తాయి ఉన్నట్టుండి. సుదర్శనం ఒక్కసారిగా హుంకరించినట్లుగా)




సుదర్శనం: గజలక్ష్మీ! చూశావా ఎట్లా పరిస్థితి తారుమారైపోయిందో, ఒక్కసారిగా? ఇపుడు ఈ ఇల్లు నాది, ఫ్యాక్టరీలు నావి, కరెంట్ ఎక్కౌంట్‌లో క్యాష్ నాది. దేర్‌ఫోర్-యాజ్ యూ ఆర్, వేర్ యూ ఆర్, ఒక్కడుగు నువ్వు లోపలకు వేయడానికి వీల్లేదు. తక్షణం కట్టు గుడ్డల్తో ఈ గడప దాటి నువ్వు బయటికి వెళ్ళిపో!! ఇదే నీకు నేను వేసే శిక్ష!!

గజలక్ష్మి: అన్యాయం...అన్యాయం సుదర్శనం! నన్ను కట్టుకున్నవాడి శవం ఇంకా అక్కడ వుండగానే నన్నీ ఇంట్లోంచి తరిమేయడం. నేను ఈ అవమానాన్ని భరించలేను...భరించలేను.

సుదర్శనం: నేనూ భరించలేక పోతున్నాను. మీరిద్దరూ కలిసి ఆడిన, ఆడుతున్న నాటకాన్ని. నీ మొగుడి కొడుగ్గా నేనీ ఇంటికి వస్తే పట్టెడన్నం పెట్టలేక పోయావ్! ఆస్తిలో హక్కుదారుడుగా ముష్టి అయిదువేలు అప్పడిగితే లేదు పొమ్మన్నావ్! అన్యాయం జరిగిపోయిందని అక్కసుపడి కట్టుకున్నవాణ్నే కడతేర్చాలను కున్నావ్ సరేలే! నువ్వేం చేస్తే నాకెందుకు? నీ బతుకునీది. నా జీవితం నాది. మనిద్దరికీ మధ్య లింకు ఆ ముసలాయన. ఇపుడా విల్లు ప్రకారం నీ ఆస్తి ఎక్కడుంటే

నువ్వక్కడకు వెళ్ళిపో. ఇక్కడ, ఈ ఇంట్లో, నా ఎదురుగ్గా, శవం దగ్గర, మీ రిద్దరూ వుండటానికి మాత్రం వీల్లేదు. గెటవుట్! ఇమ్మీడియట్లీ!!

గజలక్ష్మి: నేను...నేను...వెళ్ళను...వెళ్ళలేను...వెళ్ళిపోయి అమ్మలక్కలాడి పోసుకునే మాటలు విని బ్రతకలేను.

సుదర్శనం: వెళ్ళకుండా నువ్వూ, నీ ప్రియుడూ ఇంకా ఒక్క క్షణం ఇక్కడున్నా మిమ్మల్నిద్దర్నీ నేనేం చేస్తానో నాకే తెలీదు. వెళ్ళిపోండి, ప్లీజ్, వెళ్ళిపోండి. (పెద్దగా) గజలక్ష్మీ, నా చేతిలో కత్తి కదులుతోంది. ఆ కత్తికి తెలీదు నువ్వాడదానివని! వెళ్ళిపో...వెళ్ళిపో!

(పాంచజన్యం గభాలున సుదర్శనాన్ని కదలకుండా పట్టుకోబోయాడు. ఇన్‌స్టిన్‌టివ్‌గా సుదర్శనం కత్తి తీశాడు. ఆ పెనుగులాటలో సుదర్శనం కత్తి అతని పొత్తికడుపులోనే దిగబడిపోయింది)

సుదర్శనం: అబ్బా! (అంటూ కింద పడిపోయాడు వైకుంఠం కుర్చీ పక్కనే. తండ్రి కాళ్ళ దగ్గర కొడుకు. వైకుంఠం కళ్ళల్లోకి చూస్తున్నట్టుగా) ఏం ముసలాయనా- నా రక్తం నీ రక్తం ఒకటేగా- నీకొడుకు రక్తంతో నీ కాళ్ళే కడుక్కో! అన్యాయంగా నీ కొడుకును జైలుపక్షిని చేసినందుకు ఆ రక్తాన్నే నీ కళ్ళకద్దుకో! ఆదర్శాల కంకితమైన కొడుకునూ, శరీర కండూతికి అమ్ముడుపోయిన పడుచు పెళ్ళాన్నీ ఒకటిగా చూసిన మహాపాపానికి నా మరణమే




నీకు శిక్ష నాన్నా! నా మరణమే...నీకు...శిక్ష...నాన్నా! (తల వాల్చేశాడు)

పాంచజన్యం: మై గాడ్! చచ్చిపోయాడు, సుదర్శనం ఈజ్ డెడ్! ఏం చేయడం ఇప్పుడు? ఏం చేయడం?

గజలక్ష్మి: (పిచ్చిగా నవ్వుతూ) ఏం చెయ్యొద్దు...కళ్ళు మూసుకో...నోరు మూసుకో...(గభాలున వచ్చి పాంచజన్యాన్ని పిచ్చిగా ముద్దు పెట్టుకుంటూ) ఎంత మంచివాడివి నువ్వు! వాట్ ఎ గుడ్ బోయ్ యూ ఆర్!! నేను చెయ్యాలనుకున్న దాన్ని ఎంత సులభంగా చేసేశావ్ నువ్వు! వెరీ ఈజిలీ యూ కిల్డ్ హిమ్! ఇపుడు నాకు ఎంతో హాయిగా వుంది. తండ్రి చేసిన తప్పుకు కొడుకు శిక్ష ననుభవించాడు. దట్ ఈజ్ జస్టిస్! నౌ ఈ ఆస్తంతా నాది. ఈ ఇల్లు, ఫ్యాక్టరీలు, పొలాలు, బ్యాంకు అక్కౌంట్లు...హ...హ...హ...! వైకుంఠం, మై డియర్ హజ్‌బెండ్ వైకుంఠం పెద్ద కర్మ ముగిసే దాకా నేను నల్ల చీర కట్టుకుంటాన్లే! సుదర్శనం, మై ఫూలిష్ యంగ్ బోయ్, నీ శవం గడప దాటే దాకా పాంచజన్యానికి దూరంగా వుంటాన్లే. అదే నీకు నేనిచ్చే హారతి! పాంచజన్యం! ముందు సుదర్శనం కడుపులో దిగిన ఆ కత్తిమీద నీ వేలి ముద్రలు లేకుండా జాగర్తపడు. వాటిని తుడిచేయ్. ఊ! తొందరగా!

(పాంచజన్యం వంగి తుడుస్తుంటాడు. బయటినుంచి చక్రధరం వస్తూ)

చక్రధరం: బాబూ, చినబాబూ, అది కాదుట బాబూ విల్లు. ఇదిట, నా చేతిలోదిట. మీకు చూపించి వెంటనే తెచ్చిమ్మన్నారు నల్లకోటు నాగేశ్వరం గారూ, ఆయన కన్నా పెద్దాయనానూ! (అపుడే చూశాడు సుదర్శనం శవాన్ని. భయపడిపోయి) చినబాబూ!

గజలక్ష్మి: అది కాదా విల్లు? ఇంకొకటుందా? పాంచజన్యం తీసుకు చదువు.

పాంచజన్యం: (చక్రధరం దగ్గరినుండి బలవంతంగా లాక్కుని చదువుకొని) కొంప ముంచాడు ముసలాడు. విల్లు మార్చి రాశాడు.

గజలక్ష్మి: ఏమని?

పాంచజన్యం: కొడుకు అనుసరిస్తున్న విప్లవ పంథా ఆయనకు నచ్చలేదట. మనిద్దరం ఆయన కళ్ళుగప్పి తిరగడం కూడా ఆయనకు తెలిసిపోయిందట. అంచేత—

గజలక్ష్మి: (రెస్ట్‌లెస్‌గా) అం...చే...త?

పాంచజన్యం: స్వార్జితమైన తన ఆస్తినంతా దుర్గాబాయ్ హోమ్ ఫర్ ఆర్ఫన్డ్ చిల్డ్రన్‌కు దానం ఇచ్చేస్తున్నాట్ట!

గజలక్ష్మి: ఇడియట్! చింపేయ్ ఆ విల్లును-ముక్కలు ముక్కలు చేసి తగల బెట్టు.

పాంచజన్యం: అవును. అట్లాగే చెయ్యాలి! (చింపేయబోతుండగా)

(చక్రధరం ఆ విల్లును లాగేసుకుని బయటకు పారిపోబోతూ)

చక్రధరం: సుదర్శనం గార్ని చంపేశారు...సుదర్శనంగార్ని చంపేశారు!! విల్లును చింపేస్తున్నారు...విల్లును చింపేస్తున్నారు!

గజలక్ష్మి: పాంచజన్యం...వాణ్ణి పట్టుకో, పారిపోనీకు-క్యాచ్ హిమ్!! క్యాచ్ హిమ్!!

పాంచజన్యం: నో...నో...ఐ విల్ కిల్ హిమ్! ఐ విల్ కిల్ హిమ్!!

(ఇద్దరూ బయటకు పరుగెత్తారు)

గజలక్ష్మి: (ఒంటరిగా స్టేజిమధ్య నిలబడిపోయి, శవాలవేపు చూస్తూ) ఏవయ్యా! వైకుంఠం! తాళికట్టిన మగాడివే-ఇదా చివరకు నువ్వు చేసింది? అనాథగా రోడ్డు మీద నన్ను నిలబెట్టడమా నీ మగతనం ఘనకార్యం? ఏమిటీ నా మీద నీ నేరారోపణ? నేను నీ కళ్ళుగప్పి తిరిగాననా? కళ్ళున్న నాడు నా అందం చూసి భ్రమపడి నన్ను కొనుక్కుని నా జీవితాన్ని పాడుచేశావ్! కళ్ళు పోయిననాడు నా వయసుచూసి భయపడి, నన్ను దూరం చేసుకుని నా జీవతాన్ని నరకం చేశావ్! శిక్ష అనుభవించవలసినవాడివి మళ్ళీ నాకే శిక్ష వేశావ్! ఆనాడు సీత మగవాడి అనుమానానికి శిక్ష ననుభవించింది. ఈనాడు ఈ గజలక్ష్మి మగవాడి చేతగానితనానికి శిక్ష ననుభవిస్తోంది! ఈ శిక్షే కాదు. ఇంకే శిక్ష వేసినా నేనే కాదు, ఆడవాళ్ళమందరం, నిరంతరం ఏడుస్తూ, అనుభవించటానికి సిద్ధంగానే వున్నాం! వెయ్యండి మీ కిష్టమైన. శిక్షల్ని! వెయ్యండి...వెయ్యండి...వెయ్యండి...

చక్రధరం: (బయటినుంచి) చచ్చాను బాబోయ్! నన్ను చంపేస్తున్నారు! చంపేస్తున్నారు!!

పాంచజన్యం: (బయటినుంచే) గజలక్ష్మీ! గజలక్ష్మీ! ఐ యామ్ కాట్...ఐయామ్ కాట్!! నువ్వు పారిపో...పారిపో...

(బయట పోలీసుల విజిల్స్. పరుగెడుతున్న పాదాల చప్పుళ్ళు. పిస్టల్ పేలిన శబ్దం)

గజలక్ష్మి: పారిపోనా? ఎక్కడికి? ఏ అనాథ శరణాలయంలోకి? ఆకలిగొన్న ఏ మగవాడి బాహుబంధంలోకి?

(బయటినుంచి పోలీసులు)

గజలక్ష్మిగారూ! గజలక్ష్మిగారూ! మే ఉయ్ కమిన్?

గజలక్ష్మి: ఉండండి, నేనే వస్తున్నా మీకు స్వాగతం పలకటానికి! నన్ను ముందుగా బయటికి రానీండి. ఇక్కడ రెండు శవాలున్నాయి, ఆ తర్వాత వాటిని స్వాధీనం చేసుకుందురుగాని!! ఆ శవాల్నే శిక్షిస్తారో, నన్నే ఓ శవంగా మార్చి శిక్ష వేస్తారో తమ దయ!! రక్షక భటులు గదా!! మగ రక్షక భటులు!! వైకుంఠం గుడ్ బై...సుదర్శనం టా...టా...!! (బయటకు నడుస్తుండగా)

తెర